క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

హుజూర్‌నగర్ : పట్టణంలోని యాదవ బజార్, సుందరయ్యనగర్, బృందావన కాలనీ, టీచర్స్ కాలనీల్లో విద్యుత్ లేన్లకు తగులుతున్న చెట్ల కొమ్మలను కత్తిరించడం, లేన్లు సవరించడం తదితర పనులు చేపట్టనున్న నేపథ్యంలో గురువారం ఉదయం 6 గంటల నుంచి 11 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు విద్యుత్ ఏఈ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

నేరేడుచర్ల మున్సిపాలిటీలో..

నేరేడుచర్ల : మున్సిపాలిటీలో జాన్‌పహాడ్ రోడ్డు విస్తరణలో భాగంగా విద్యుత్ స్తంభాలను మార్చేందుకు ఉదయం 7 గంటల నుంచి 11 గంటల వరకు విద్యుత్ విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్లు ట్రాన్స్‌కో ఏఈ పందిరి శ్రీనివాస్ ఒక ప్రకటనలో తెలిపారు. విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

నారాయణఖేడ్ ఆర్డీఓపై చర్యలు తీసుకోవాలి

నేరేడుచర్ల : ఉపాధ్యాయులపై లాఠీచార్జ్ చేయించిన నారాయణఖేడ్ ఆర్డీఓపై చర్యలు తీసుకోవాలని టీఎస్ యూటీఎఫ్ మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు యడవల్లి కృష్ణయ్య, బుడిగే అక్కయ్యబాబులు బుధవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. ఎన్నికల విధుల్లో పాల్గొన్న ఉద్యోగులకు నిబంధనల ప్రకారం రెమ్యూనరేషన్ చెల్లించాలని అడిగినందుకు ఉపాధ్యాయులపై పోలీసులతో లాఠీచార్జ్ చేయించడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని తెలిపారు.

ఉపాధ్యాయులపై లాఠీచార్జ్ సరికాదు

హుజూర్‌నగర్ : ఎన్నికల విధుల్లో పాల్గొన్న ఉపాధ్యాయులకు టీఏ, డీఏ చెల్లించాలని ప్రశ్నించినందుకు వారిపై లాఠీచార్జ్ చేయడం సరికాదని, పోలీసులు ఉపాధ్యాయులపై లాఠీచార్జ్ చేయడాన్ని ఖండిస్తున్నామని టీఎస్‌యూటీఎఫ్ హుజూర్‌నగర్ మండల శాఖ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు రాజశేఖర్‌రెడ్డి, రామకృష్ణ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉపాధ్యాయులపై దౌర్జన్యం చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

పండ్ల తోటల రైతులను ప్రభుత్వం ఆదుకోవాలి

నడిగూడెం : ఇటీవల కురిసిన అకాల వర్షాలకు నష్టపోయిన మామిడి, నిమ్మ రైతులను ఆదుకోవాలని పండ్ల తోటల రైతు సంఘం రాష్ట్ర నాయకుడు ఏనుగుల వీరాంజనేయులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం మండల పరిధిలోని రామాపురంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గత ఐదు సంవత్సరాలుగా అకాల వర్షాలు, ఈదురుగాలులకు రైతులు తీవ్రంగా నష్టపోతున్నారన్నారు. సంబంధిత అధికారులను స్పందించి క్షేత్ర స్థాయిలో పంట నష్టాన్ని పరిశీలించి రైతులకు నష్టపరిహారం చెల్లించాలని ఆయన కోరారు.

రాములమ్మ మృతి పార్టీకి తీరని లోటు



రాములమ్మ మృతదేహంపై పూలమాల వేస్తున్న నాగన్నగౌడ్

హుజూర్‌నగర్ : పట్టణానికి చెందిన కాంగ్రెస్ నాయకురాలు రాములమ్మ మృతి పార్టీకి తీరని లోటని ఐఎన్‌టీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి యరగాని నాగన్నగౌడ్ అన్నారు. బుధవారం రాములమ్మ మృతదేహాన్ని నాగన్నగౌడ్ సందర్శించి పూలమాలలు వేసి నివాళులర్పించారు. బాధిత కుటుంబానికి పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఆయన వెంట మున్సిపల్ కౌన్సిలర్ కస్తాల శ్రవణ్‌కుమార్ తదితరులు ఉన్నారు.

వృద్ధులకు పండ్లు పంపిణీ



పండ్లు పంపిణీ చేస్తున్న అంబేద్కర్

మునగాల : మండల పరిధిలోని ముకుందాపురం వృద్ధాశ్రమంలో బుధవారం తాడ్వాయి గ్రామానికి చెందిన మాతంగి అంబేద్కర్ పుట్టిన రోజు సందర్భంగా వృద్ధులకు పండ్లు, బ్రెడ్ పాకెట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వృద్ధాశ్రమం అభివృద్ధికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లేపల్లి సైదిబాబు, ఆశ్రమం నిర్వాహకురాలు నాగిరెడ్డి విజయమ్మ తదితరులు పాల్గొన్నారు.

ఆర్థికసాయం అందజేత

అర్వపల్లి : మండల పరిధిలోని కొమ్మాల గ్రామానికి చెందిన గోదల వీరమ్మ అనారోగ్యంతో మంచం పట్టింది. ఆమె వైద్యం చేయించుకునే స్తోమత లేకపోవడంతో గ్రామానికి చెందిన బీఆర్‌ఎస్ నాయకుడు డాక్టర్ తాడూరి రామకోటి బుధవారం తనవంతు సాయంగా రూ.5వేలు ఆర్థికసాయం అందజేశారు. ఆయన వెంట డాక్టర్ వెంకన్న, గంగదెరి వెంకట్, బీఆర్‌ఎస్ నాయకులు ఉన్నారు.

ప్రమాదకరంగా డ్రెయినేజీ



నడిగూడెంలోని బీసీ కాలనీలో గూన దెబ్బతినడంతో కంపవేసిన దృశ్యం



మండపం సెంటర్‌లో డ్రెయినేజీని తవ్వుతున్న సిబ్బంది

- వలుచోట్ల దెబ్బతిన్న గూనలు
- వర్షానికి వీధుల్లో పారుతున్న నీరు
- రాకపోకలకు ప్రజల ఇబ్బందులు

నడిగూడెం : మండల పరిధిలోని పలు గ్రామాల్లో డ్రెయినేజీ దెబ్బతిని ప్రమాదకరంగా ఉంది. దీంతో ప్రజల పోకలకు ఇబ్బందికరంగా మారింది. ఈవిషయమై స్థానిక ప్రజలు సంబంధిత అధికారులకు అనేకసార్లు విన్నవించినా స్పందన కరువైందని వారు ఆరోపిస్తున్నారు. ప్రధానంగా నడిగూడెం మండల కేంద్రంలోని బీసీ కాలనీలో మురుగు కాల్వ గూన పూర్తిగా దెబ్బతిన్నది. అలాగే మండపం సెంటర్‌లోని డ్రెయినేజీ పూడిపోవడంతో పలువురు పగులకొట్టారు. దీంతో ఇటీవల కురిసిన వర్షానికి వర్షపు నీరు వీధిల్లో ప్రవహించింది. దీంతో ఆ కాలనీ ప్రజలు రాకపోకలకు నానా ఇబ్బంది పడ్డారు. అలాగే ఎస్సీ కాలనీలోని పలుచోట్ల కూడా మురుగు కాల్వలు పూర్తిగా దెబ్బతిన్నాయి. దీంతో ఆయా ప్రాంతాలలో నిత్యం ప్రమాదాలు జరుగుతున్నాయి. అలాగే మండల పరిధిలోని బృందావనపురం, వేణుగోపాలపురం, చెన్నకేశ్వాపురం, సిరిపురం, వల్లాపురం, శ్రీరంగాపురం, చాకిరాల, రత్నవరం, రామాపురం గ్రామాల్లో కూడా పలుచోట్ల మురుగు కాల్వలు దెబ్బతిన్నాయి. పలుచోట్ల డ్రెయినేజీ పూడిపోవడంతో మురుగు నీరు వీధుల్లో ప్రవహిస్తున్నది. మురుగు నీరు ఇళ్లల్లోకి చేరుతున్నదని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

పూడిపోయిన మురుగు కాల్వలు

మండల కేంద్రం, మండల పరిధిలోని గ్రామాల్లో మురుగు కాల్వల్లో పంచాయతీ సిబ్బంది పూడిక తీయడం లేదని ప్రజలు ఆరోపిస్తున్నారు. దీంతో కాల్వలు పూడిపోయి మురుగు నీరు నిలుస్తుండడంతో దుర్వాసన, దోమలు, ఈగల సంచారంలో ఇబ్బందులు పడుతున్నామని అంటున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి తగు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

ప్రమాదాలు జరుగుతున్నాయి



మండల కేంద్రంలోని బీసీ కాలనీలో మురుగు కాలువలో ఏర్పాటు చేసిన గూన పూర్తిగా దెబ్బతిన్నది. దీంతో ఈ ప్రాంతంలో నిత్యం ప్రమాదాలు జరుగుతున్నాయి. సంబంధిత అధికారులు స్పందించి తక్షణమే కొత్త గూన ఏర్పాటు చేసి, మరమ్మతులు చేపట్టాలి.

– కాసోని వెంకటేష్, నడిగూడెం

అధికారులు స్పందించాలి



మా గ్రామంలో మురుగు కాల్వలు ప్రమాదకరంగా మారాయి. పలు కాలనీల్లో కాల్వల్లో పూడిక తీయడంలేదు. దీంతో దుర్వాసన వెదజల్లుతోంది. దోమలు, ఈగల సంచారంతో ఇబ్బందులు పడుతున్నాం. అధికారులు స్పందించి మురుగు కాల్వల సమస్యను తక్షణమే పరిష్కరించాలి.

– కలకొండ అలివేలమ్మ, బృందావనపురం

మరమ్మతులు చేస్తాం

మండల కేంద్రంలోని డ్రెయినేజీ సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు కృషి చేస్తాం. పాతకాలం నాటి డ్రెయినేజీ కావడంతో దెబ్బతిని మురుగు నీరు బయటకు వెళ్లడం లేదు. అత్యవసరంగా మూడు రోజుల్లోనే మరమ్మతులు చేపడతాం.

– దుర్గాప్రసాద్, ఎంపీఓ

పల్లె ప్రకృతి వనాల్లో ఎండిపోతున్న చెట్లు



వేణుగోపాలపురంలో ఎండిపోయిన చెట్లు



నడిగూడెంలో..

నడిగూడెం : మండల కేంద్రంతో పాటు మండలంలోని పలు గ్రామాల్లో గల పల్లె ప్రకృతి వనాల్లో చెట్లు, మొక్కలు ఎండిపోతున్నాయి. గత సర్పంచ్‌ల పదవీ కాలం పూర్తికావడంతో పల్లె ప్రకృతి వనాలను పట్టించుకునే నాథుడు కరువయ్యారు. ప్రస్తుత వేసవిలో పలు గ్రామాల్లో నీటి ఎద్దడి ఏర్పడింది. దానికితోడు సంబంధిత అధికారులు పల్లె ప్రకృతి వనాలను పట్టించుకోవడం లేదని ప్రజలు ఆరోపిస్తున్నారు. గ్రామ పంచాయతీలలో నీటిని సరఫరా చేసే ట్యాంకర్లు ఉన్నా సంబంధిత అధికారుల పర్యవేక్షణ కొరవడడంతో చెట్లు ఎండిపోతున్నాయని ప్రజలు వాపోతున్నారు. లక్షల రూపాయల వ్యయంతో పల్లె ప్రకృతి వనాల్లో చెట్లను పెంచుతున్నారు కానీ వేసవిలో వాటికి నీరందించలేకపోతుండడంతో అవి ఎండిపోతున్నాయని ప్రజలు ఆరోపిస్తున్నారు. సంబంధిత అధికారులు స్పందించి చెట్లను కాపాడాలని ప్రజలు కోరుతున్నారు.

తీన్మార్ మల్లన్నను గెలిపించాలి

నూతనకల్ : నల్లగొండ, ఖమ్మం, వరంగల్ పట్టభద్రుల ఎమ్మెల్సీ స్థానానికి పోటీ చేస్తున్న కాంగ్రెస్ అభ్యర్థి తీన్మార్ మల్లన్నను అధిక మెజార్టీతో గెలిపించాలని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు నాగం సుధాకర్‌రెడ్డి అన్నారు. బుధవారం మండల కేంద్రంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వ అరాచకాలను క్యూన్యూస్ ద్వారా ఎండగట్టి ప్రజలను చైతన్యవంతులను చేసి కాంగ్రెస్ అధికారంలోకి రావడానికి కృషి చేసిన తీన్మార్ మల్లన్నకు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి అధిక మెజార్టీతో గెలిపించాలని ఓటర్లను కోరారు. సమావేశంలో పార్టీ నాయకులు దరిపెల్లి వీరన్న, కల్లెం కృష్ణారెడ్డి, బాణాల సుదర్శన్ రెడ్డి, లింగాల రామచంద్రు, బత్తుల నాగమల్లు, సురుగు రామచంద్రు, రాచకొండ అయోధ్య, తొనుకునూరి సైదులుగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

పల్లెప్రకృతి వనాలు, నర్సరీల పరిశీలన

నూతనకల్ : ఎండలు తీవ్రత నేపథ్యంలో పల్లెప్రకృతి వనాల్లో పెంచుతున్న మొక్కలను నిర్వాహకులు సంరక్షించాలని ఎంపీడీఓ సునీత కోరారు. బుధవారం మండల పరిధిలోని మిర్యాల, లింగంపల్లి, అల్లునూరు గ్రామాల్లో పల్లెప్రకృతి, వననర్సరీలను ఆమె పరిశీలించి మాట్లాడారు. ప్రకృతి వనాల్లో నాటిన మొక్కలను, నర్సరీల్లో పెంచుతున్న మొక్కలను కాపాడటం కోసం నిర్వాహకులు ప్రత్యేక చర్యలు చేపట్టడంతో పాటు గ్రామాల్లో చెత్త సేకరణను చేపట్టి గ్రామాలను పరిశుభ్రంగా ఉంచాలని ఆమె కోరారు. ఆమె వెంట పంచాయతీ కార్యదర్శులు అనిల్, నాగన్న, సోమేష్ తదితరులు ఉన్నారు.

19న మిర్యాలగూడలో 'జల్సా'



అజీమిస్ షాన్ జల్సా పోస్టర్ ఆవిష్కరిస్తున్న ముస్లిం మత పెద్దలు

మిర్యాలగూడ : మిర్యాలగూడ పట్టణంలోని ఉస్మానియా మసీద్‌లో మౌలాన అతికుల్ రెహమాన్ ఆధ్వర్యంలో ఈనెల 19న అజీమిస్ షాన్ జల్సా నిర్వహిస్తున్నట్లు మత పెద్దలు హఫీజొద్దీన్ పాషా, అహ్మద్‌దావుష్ తెలిపారు. బుధవారం స్థానిక ఉస్మానియా మసీదులో జల్సా పోస్టర్‌ను వారు ఆవిష్కరించి మాట్లాడారు. ఈ జల్సాకు గుజరాత్‌కు చెందిన మత పెద్దలు మౌలానా సలావుద్దీన్‌సైఫీ పాల్గొంటారన్నారు. 19న సాయంత్రం 6గంటల నుంచి రాత్రి 10గంటల వరకు ఈ జల్సా కొనసాగుతుందన్నారు.ఈ కార్యక్రమానికి ముస్లింలు పెద్ద సంఖ్యలో హాజరు కావాలని కోరారు. కార్యక్రమంలో మసీదు కమిటీ అధ్యక్షుడు ఎండి.ఇస్మాయిల్, అంజాద్‌బాబా, తౌఫిక్, కమిటీ సభ్యులు మొహమ్మద్ రఫీక్, హఫీజ్, అబ్దుల్ మన్నాన్, పాషా, షఫి, జుబేర్, సాధిక్, షరీఫ్, సుల్తాన్ పాల్గొన్నారు.

ఇటుక బట్టీలను తొలగించాలని వినతి



ఆర్డీఓకు వినతిపత్రం అందజేస్తున్న శ్రీనివాస్‌నగర్ కాలనీవాసులు

మిర్యాలగూడ : మిర్యాలగూడ మండలంలోని శ్రీనివాస్‌నగర్ గ్రామపంచాయతీలో ఉన్న ఇటుక బట్టీలను తొలగించాలని కాలనీ ప్రజలు కోరారు. ఈ మేరకు బుధవారం ఆర్డీఓ శ్రీనివాసరావుకు వినతిపత్రం అందచేసి మాట్లాడారు. డబుల్ బెడ్ రూమ్ ఇళ్లకు వెళ్లే దారిని సైతం ఇటుక బట్టీల యాజమాన్యం ఆక్రమించడంతో రాకపోకలకు ఇబ్బందిగా మారిందన్నారు. ఇటుకబట్టీల వల్ల తినే ఆహారంలో, తాగునీటిపై దుమ్ము, బూడిద పడుతుందని, తమ ఆరోగ్యం దెబ్బతింటుందని ఆవేదన వ్యక్తం చేశారు. అధికారులు స్పందించి ఇటుకబట్టీలను తొలగించి నిర్వాహకులపై చర్యలు తీసుకోవాలని, లేనట్లయితే శ్రీనివాస్‌నగర్ నుంచి పట్టణంలోని ఆర్డీఓ కార్యాలయం వరకు పాదయాత్ర చేసి నిరసన వ్యక్తం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో ముడావత్ జగన్, వీరన్న, నుమాన్, జావిద్, పర్వేస్, బిస్మిల్లా, తరుణ్, మోహన్ పాల్గొన్నారు.

జంకుతండాలో తాగునీటి సమస్య పరిష్కరించాలి



కార్యదర్శికి వినతిపత్రం అందజేస్తున్న బీజేపీ నాయకులు

మిర్యాలగూడ టౌన్ : మిర్యాలగూడ మండలం జంకుతండాలో తాగునీటితో పాటు విద్యుత్ సమస్యను పరిష్కరించాలని కోరుతూ బుధవారం బీజేపీ రాష్ట్ర కమిటీ సభ్యుడు సత్యప్రసాద్ ఆధ్వర్యంలో పంచాయతీ కార్యదర్శి ప్రశాంత్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా కనపర్తి సత్యప్రసాద్ మాట్లాడుతూ జంకుతండా గ్రామ పంచాయతీలో ప్రజలు ప్రధానంగా డ్రెయినేజీ, విద్యుత్, తాగునీటి సమస్యను తీవ్రంగా ఎదుర్కొంటున్నారని, పంచాయతీ అధికారులు, స్పెషల్ అధికారులు తక్షణమే పరిష్కరించాలని కోరారు. వినతిపత్రాన్ని అందజేసిన వారిలో బీజేపీ నాయకులు విజయనాయక్, కిషన్ నాయక్, కో ఆర్డినేటర్ నరేష్‌నాయక్, సుబ్రమణ్యం రాజు, అంజి, మల్లేష్ తదితరులున్నారు.

సమస్యల పరిష్కారంపై అధికారులు దృష్టి సారించాలి

నేరేడుచర్ల : గ్రామాల్లో సమస్యల పరిష్కారానికి అధికారులు దృష్టి సారించాలని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు ధనుంజయనాయుడు అన్నారు. బుధవారం నేరేడుచర్లలో ఆయన విలేకరులతో మాట్లాడారు. పార్లమెంటు ఎన్నికల దృష్ట్యా గ్రామాల్లో సమస్యలు ఎక్కడికక్కడే తిష్ట వేశాయని తెలిపారు. గ్రామాలు, మున్సిపాలిటీలో మిషన్ భగీరథ పైపులైన్లు పగిలి లీకవుతుండటంతో నీరు వృథాగా పోతుందని తెలిపారు. అధికారులు స్పందించి సమస్యలను పరిష్కరించాలని కోరారు. ఆయన వెంట సీపీఐ మండల కార్యదర్శి యల్లబోయిన సింహాద్రి, పట్టణ కార్యదర్శి కత్తి శ్రీనివాస్‌రెడ్డి, రావుల సత్యం, శ్రీను, వెంకట్, సైదులు తదితరులు ఉన్నారు.

విద్యుదాఘాతంతో పాడిగేదె మృతి

అర్వపల్లి : విద్యుదాఘాతంతో ఓ పాడి గేదె మృతి చెందింది. ఈ ఘటన జాజిరెడ్డిగూడెం మండలంలోని తిమ్మాపురం గ్రామంలో బుధవారం చోటు చేసుకుంది. బాధిత రైతు తెలిపిన వివరాల ప్రకారం .. గ్రామానికి చెందిన బొడ్డు శ్రీరాములు అనే రైతు తన పాడిగేదెను మేత కోసం గ్రామ శివారులోని పొలంలోకి తోలుకెళ్లి మేపుతుండగా పొలంలోని విద్యుత్ వైరు తగిలి అక్కడికక్కడే మృతి చెందింది. గేదె విలువ రూ.60వేలు ఉంటుందని, తాను నిరుపేదనని పాడి గేదే తన కుటుంబానికి ఆధారమని రైతు శ్రీరాములు విలపించాడు. ప్రభుత్వం తనను ఆదుకోవాలని కోరాడు.

దుర్గం ప్రభాకర్ పరామర్శ

పెన్‌పహాడ్ : మండల పరిధిలోని నారాయణగూడెం గ్రామానికి చెందిన పాస్టర్ ఇమ్మానియేల్ మాతృమూర్తి గంటేపంగి మల్లమ్మ అనారోగ్యంతో బుధవారం మృతి చెందింది. మృతదేహాన్ని సూర్యాపేట జిల్లా పాస్టర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు దుర్గం ప్రభాకర్ సందర్శించి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయన వెంట బొక్క ఏలియరాజు, యల్క ప్రభాకర్, కొండేటి లాజర్ తదితరులు ఉన్నారు.

మల్లయ్యకు నివాళి

అర్వపల్లి : మండల పరిధిలోని కుంచమర్తి గ్రామానికి చెందిన బీజేపీ మండల అధ్యక్షుడు పగిళ్ల శంకర్ తండ్రి మల్లయ్య దశదినకర్మను బుధవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు సంకినేని వెంకటేశ్వర్‌రావ్ పాల్గొని మల్లయ్య చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఆయన వెంట సూర్యాపేట జెడ్పీటీసీ జీడి భిక్షం, మాజీ సర్పంచ్ ఉగ్గం ఉపేంద్రలింగరాజు, బీజేపీ నియోజకవర్గ కన్వీనర్ కాపా రవికుమార్, జిల్లా ప్రధాన కార్యదర్శి మల్లెపాక సాయిబాబ, మైనార్టీ మోర్చా రాష్ట్ర కార్యదర్శి ఎండీ.అబీద్, బూతం సాగర్, కొప్పుల క్రాంతిరెడ్డి, వివిధ మండలాల బీజేపీ అధ్యక్షులు, వివిధ పార్టీల నాయకులు ఉన్నారు.

కొత్తగూడెంలో నీటి సమస్యతో ఇబ్బందులు

తుంగతుర్తి : మండల పరిధిలోని కొత్తగూడెం గ్రామంలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని కోరుతూ బుధవారం తిరుమలగిరిలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే మందల సామేల్‌ను గ్రామస్తులు కలిశారు. అనంతరం ఆయనకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ జిల్లా మహిళా అధ్యక్షురాలు తిరుమలగడ అనురాధ కిషన్‌రావు మాట్లాడారు. గ్రామంలో నీటి సమస్యతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని, నీటికోసం రెండు బోర్లు వేయించాలని, సీసీరోడ్లు సౌకర్యం కల్పించాలని ఎమ్మెల్యేను కోరినట్లు తెలిపారు. దీంతో ఎమ్మెల్యే వెంటనే స్పందించి గ్రామంలో మంచినీటి సమస్య లేకుండా చూడాలని ఆర్‌డబ్ల్యూఎస్ డీఈఈని ఆదేశించారు. అలాగే గ్రామంలో నెలకొన్న సమస్యలను పరిష్కరిస్తానని ఆయన హామీ ఇచ్చారు. కలిసిన వారిలో పార్టీ జిల్లా అధ్యక్షుడు చెవిటి వెంకన్నయాదవ్, నాయకులు కాసర్ల గణేష్, ఆవుల కొమురెల్లి, వీరయ్య, వగలగాని సుదర్శన్, వెంకన్న, సైదులు, పరుశరాం, సతీష్, మైసయ్య, అంజయ్య, శ్రీను, సంతోస్ తదితరులు ఉన్నారు.

తాగునీటి సమస్య లేకుండా చూడాలి



కార్యదర్శులు, ఉపాధి హామీ సిబ్బందితో సమీక్ష నిర్వహిస్తున్న ఎంపీడీఓ గిరిబాబు

చిలుకూరు : గ్రామాల్లో మంచినీటి సమస్య లేకుండా చూడాలని ఎంపీడీఓ గిరిబాబు సూచించారు. బుధవారం చిలుకూరు మండల పరిషత్ కార్యాలయంలో గ్రామ పంచాయతీ కార్యదర్శులు, ఉపాధి హామీ అధికారులు, సిబ్బందితో మండల అభివృద్ధిపై నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు సక్రమంగా అమలయ్యేలా చూడాలని అన్నారు. గ్రామాల్లోని నర్సరీల్లో మొక్కలు ఎండిపోకుండా ప్రత్యేక దృష్టి సారించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీఓ ఇబ్రహీం, ఏపీఓ నిర్మల, గ్రామ కార్యదర్శులు, టీఏలు, ఉపాధి హామీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పైప్‌లైన్‌కు తక్షణమే మరమ్మతులు

- భగీరథ పైప్‌లైన్ లీకేజీపై 'సాక్షి'లో వచ్చిన కథనానికి స్పందించిన కలెక్టర్
- కలెక్టర్ ఆదేశాలతో పనులు చేపట్టిన అధికారులు



మిషన్ భగీరథ పైప్‌లైన్ లీకేజీని పరిశీలిస్తున్న ఎంపీడీఓ, గ్రామ కార్యదర్శి

సాక్షి ఎఫెక్ట్..

చిలుకూరు : మండల కేంద్రంలోని బస్టాండ్ సెంటర్‌లో కోదాడ-జడ్చర్ల రహదారిపై మిషన్ భగీరథ పైపులైన్ పలుచోట్ల లీకై నీరు వృథాగా పోతుండటంతో పాటు నీళ్లు కలుషితం అవుతున్నాయని బుధవారం సాక్షి పత్రికలో 'భగీరథ నీటి వృథాపై పట్టింపేదీ'అనే శీర్షికతో ప్రచురితమైన కథనానికి జిల్లా కలెక్టర్ స్పందించారు. కలెక్టర్ ఆదేశాల మేరకు ఎంపీడీఓ గిరిబాబు పైప్‌లైన్ లీకవుతున్న ప్రదేశాన్ని పరిశీలించారు. సంబంధిత అధికారులతో మాట్లాడి పైప్‌లైన్ మరమ్మతు పనులు చేపట్టారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రెండు రోజుల్లో పైపులైన్‌కు మరమ్మతులు పూర్తి చేస్తామని తెలిపారు. అదేవిధంగా చిలుకూరు పరిధిలోని బేతవోలు రోడ్డులో 'చేతిపంపును వినియోగంలోకి తీసుకురావాలి'అనే శీర్షికతో సాక్షి పత్రికలో ప్రచురితమైన కథనానికి కూడా ఆయన స్పందించారు. బోరుకు మరమ్మతులు చేపట్టి ఉపయోగంలోకి తీసుకొస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీఓ ఇబ్రహీం, గ్రామ కార్యదర్శి షరీఫ్‌వుద్దీన్, బిల్ కలెక్టర్ ధర్మయ్య, ఉపేందర్, జీపీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

చెత్తా చెదారం.. రోడ్ల వెంటే దర్శనం

- గ్రామాల్లో పారిశుధ్యం అస్తవ్యస్తం
- పూడిక తీయక దుర్వాసన వెదజల్లుతున్న మురుగు కాల్వలు
- ప్రత్యేక అధికారులు గ్రామాలను సందర్శించడం లేదని విమర్శలు



కొత్తతండాలో రోడ్ల వెంట పేరుకుపోయిన చెత్తాచెదారం

పాలకవీడు : మండలంలో పారిశుధ్యం అస్తవ్యస్తంగా తయారైంది. గ్రామ పంచాయతీ సిబ్బంది చెత్త చెదారాన్ని డంపింగ్ యార్డుకు తరలించకపోవడంతో రోడ్ల వెంటే దర్శనమిస్తోంది. నెలలకొద్దీ చెత్త రోడ్లపై పేరుకుపోతుండడంతో దుర్వాసన వచ్చి ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. అయితే గ్రామాల్లో సర్పంచ్‌ల పదవీకాలం ముగియడంతో ప్రభుత్వం ప్రత్యేక అధికారులను నియమించింది. వీరు పంచాయతీ అధికారులు, గ్రామపంచాయతీ సిబ్బందితో కలిసి గ్రామంలో అభివృద్ధి పనులు చేపట్టాలి. కానీ ప్రత్యేక అధికారుల పాలన వచ్చి నాలుగు నెలలు కావస్తున్నా గ్రామాలను వారు సందర్శించడం లేదనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. అధికారుల పర్యవేక్షణ లేకపోవడం, పారిశుధ్య కార్మికులకు నెలనెలా వేతనాలు అందకపోవడంతో వారు కూడా పనులు చేయడానికి నిరాసక్తి కనబరుస్తున్నారు. రోజుల తరబడి చెత్తాచెదారం తొలగించడం లేదని, మురుగు కాల్వలు పూడికతీయడం లేదని ప్రజలు ఆరోపిస్తున్నారు. దీంతో పరిసరాలు దుర్గంధం వెదజల్లుతున్నాయని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సంబంధిత అధికారులు పారిశుధ్యంపై దృష్టి సారించి చెత్తను డంపింగ్ యార్డ్‌కు తరలించాలని, మురుగు కాల్వలు పూడిక తీయాలని చూడాలని ప్రజలు కోరుతున్నారు.

మల్లమ్మ మృతికి సంతాపం

పెన్‌పహాడ్ : మండల పరిధిలోని నారాయణగూడెం గ్రామానికి చెందిన మాజీ వార్డు మెంబర్, సీనియర్ నాయకురాలు గంటేపంగి మల్లమ్మ(69) బుధవారం అనారోగ్యంతో మృతి చెందింది. దీంతో ఆమె మృతదేహాన్ని మాజీ మంత్రి, నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జ్ రాంరెడ్డి దామోదర్‌రెడ్డి సందర్శించి పూలమాలలు వేసి నివాళులర్పించారు. మల్లమ్మ మృతి పట్ల సంతాపం తెలిపారు. ఆయన వెంట మాజీ ఎంపీపీ మండలి జ్యోతి, పిచ్చయ్య, నారాయణ, ప్రవీణ్‌రెడ్డి, సైదులు, యోగి, సందీప్, బ్రహ్మాచారి, నాగయ్య, ఉమామహేశ్వర్‌రెడ్డి, కృష్ణారెడ్డి, నగేష్ తదితరులు ఉన్నారు.

19న సుందరయ్య వర్ధంతి సభ

మిర్యాలగూడ అర్బన్: మిర్యాలగూడలో ఈ నెల 19వ తేదీన నిర్వహించబోయో పుచ్చలపల్లి సుందరయ్య 39వ వర్ధంతి సభను విజయవంతం చేయాలని సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు డబ్బికార్ మల్లేష్ అన్నారు. బుధవారం స్థానిక పార్టీ కార్యాలయంలో ఆ పార్టీ జిల్లా కమిటీ సభ్యుడు, మండల కార్యదర్శుల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు రేపల్లి వెంకటేశ్వర్లు, జగదీష్‌చంద్ర, రవినాయక్, మల్లు గౌతంరెడ్డి, బాండ్ల పాండు, శశిధర్‌రెడ్డి, వినోద్‌నాయక్, అయూబ్ తదితరులున్నారు.

గురువును కలిసిన మాజీ మంత్రి జానారెడ్డి



తన గురువు సుబ్బారావును పలకరిస్తున్న జానారెడ్డి

మిర్యాలగూడ: సీఎల్పీ మాజీ నేత కుందూరు జానారెడ్డి తన గురువైన మానవ హక్కుల సంఘం రాష్ట్ర నాయకుడు పొన్నూరు సుబ్బారావును బుధవారం మిర్యాలగూడెం పట్టణంలోని ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిసారు. ఈ సందర్భంగా గురు శిష్యులిద్దరు ఆప్యాయంగా ఆలింగనం చేసుకున్నారు. జానారెడ్డి తన గురువు సుబ్బారావు ఆరోగ్యం, యోగ క్షేమాలను అడిగి తెలుసుకున్నారు.

అధ్వానంగా ఎన్నెస్పీ కాల్వలు

- శిథిలావస్థలో తూములు, షెట్టర్లు
- పూడిన మైనర్ కాల్వలు
- వర్షాకాలం రాకముందే మరమ్మతులు చేపట్టాలని కోరుతున్న రైతులు



మఠంపల్లి సమీపంలో అధ్వానంగా ఉన్న ఎన్నెస్పీ మైనర్ కాల్వ

మఠంపల్లి : నాగార్జునసాగర్ ప్రాజెక్టు ఎడమ కాలువ పరిధిలో మఠంపల్లి మండలంలోని ముక్త్యాల బ్రాంచ్ కెనాల్‌కు అనుసంధానంగా ఉన్న ఎన్నెస్పీ మైనర్ కాల్వలు అధ్వానంగా తయారయ్యాయి. మట్టపల్లి, గుండ్లపల్లి మేజర్ కాల్వల కింద ఉన్న ఈ మైనర్ కాల్వలు చాలా ఏళ్లుగా మరమ్మతులకు నోచుకోవడం లేదు. అయితే రానున్న కొద్దిరోజుల్లో వర్షాలు సమృద్ధిగా కురిస్తే రైతులు ఈ మైనర్ కాల్వల కింద వరి సాగు చేపడుతారు. కావున మైనర్ కాల్వలకు త్వరితగతిన మరమ్మతులు చేపట్టాలని ఆయకట్టు, చివరి ఆయకట్టు భూముల రైతులు కోరుతున్నారు. ముఖ్యంగా మఠంపల్లి, చౌటపల్లి, బక్కమంతులగూడెం, అల్లీపురం, భీల్యానాయక్‌తండా, దొనబండతండా, కొత్తతండా తదితర గ్రామాల పరిధిలోని 15ఆర్, 20ఎల్, 20ఆర్ తదితర మైనర్ కాల్వల కింద వందలాది ఎకరాలకు సాగునీరు అందాల్సి ఉంది. కానీ మైనర్ కాల్వలు పూడిపోవడతో పాటు కాల్వల్లో కంపచెట్లు పెరిగాయి. అంతేకాకుండా తూములు, రాపులు, షెట్టర్లు మొదలైనవి శిథిలావస్థకు చేరాయి. కావున సంబంధిత అధికారులు స్పందించి ఎన్నెస్పీ కాల్వలకు, తూములకు వెంటనే మరమ్మతులు చేపట్టాలని రైతులు కోరుతున్నారు.

అధికారులు దృష్టి పెట్టాలి



మట్టపల్లి, గుండ్లపల్లి మేజర్ కాల్వల పరిధిలో గల మైనర్ కాల్వల దుస్థితిపై ఎన్నెస్పీ అధికారులు దృష్టి సారించాలి. వర్షాకాలం రాకముందే కాల్వలకు మరమ్మతులు చేపట్టాలి.

– బోగాల వీరారెడ్డి, రైతు, బక్కమంతులగూడెం

మరమ్మతులు చేపట్టాలి



మండలంలోని ఆయకట్టు, చివరి ఆయకట్టు వరి పొలాలకు సాగు నీరు అందాలంటే మైనర్ కాలువలకు మరమ్మతులు చేపట్టాలి. లేనట్లయినతే చివరి భూములకు సాగునీరు అందడం కష్టంగా మారుతుంది. కావున కాల్వలకు వెంటనే మరమ్మతులు చేపట్టాలి.

– జాల కిరణ్‌యాదవ్, మాజీ ఉపసర్పంచ్, మఠంపల్లి